W W W.EPAPER.MAHADAILY.COM
మహా పత్రిక
ఖమ్మం
భద్రాద్రి కొత్తగూడెం
12-10-2025





# హిందుత్వమే భారత్ ఆత్మ

- ధర్మరక్షణే మన కర్తవ్య మార్గం
- సమరసతతో సమాజానికి శాంతి
- సామాజిక సమరసత వేదిక తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ అప్పాల ప్రసాద్
- ఖమ్మం నగరంలో అయ్యప్ప అన్నప్రసాద వితరణ ప్రాంగణం ప్రారంభం

08





సస్పెండ్ అయిన బీట్ ఆఫీసర్ శ్రీకాంత్

07

## ఖమ్మం అటవీ శాఖలో

# భారీ కుంభకోణం

### రేంజర్, బీట్ ఆఫీసర్ సస్పెన్షన్

- విధుల దుర్వినియోగం, కలప అక్రమ రవాణా
- ఖమ్మం రేంజ్ బాధ్యతలు మధిర రేంజర్‌కు అదనంగా అప్పగింత

ఖమ్మం, మహా

ఖమ్మం జిల్లా అటవీ శాఖలో సంద్ర కలప అక్రమ రవాణాకు సంబంధించిన సంచలన విషయాలు వెలుగులోకి వచ్చాయి. ఈ అవినీతి వ్యవహారంలో ఇప్పటికే బీట్ ఆఫీసర్ శ్రీకాంత్‌ను సస్పెండ్ చేయగా, తాజాగా ఫారెస్ట్ రేంజర్ నాగేశ్వరరావుపై వచ్చిన ఆరోపణలు కూడా నిజమని తేలడంతో, ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ సువర్ణ శనివారం ఆయన్ను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. కలపను లేనట్లుగా చూపి, ఇతర జిల్లాలకు, రాష్ట్రాలకు తరలించడంలో రేంజర్ తన విధులను దుర్వినియోగం చేశారని విచారణలో తేలింది. ఈ ఘటన శాఖలోని లోపాలను స్పష్టంగా బయటపెట్టింది.



02

# రైతే రాజు

### మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి

రైతును రాజును చేయడం, పేదలకు సొంత ఇల్లు ఇవ్వడం, ప్రతి అర్హుడికి రేషన్ కార్డు, సంక్షేమ ఫలాలు అందించడమే ఇందిరమ్మ ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర రెవెన్యూ, హౌజింగ్, సమాచార పౌరసంబంధాల శాఖల మంత్రివర్యులు పొంగులేటి శ్రీనివాస రెడ్డి అన్నారు.



03

# యజ్ఞంలా పారిశుద్ధ్య పనులు

### కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

నగరంలో మరింత మెరుగ్గా పారిశుద్ధ్య నిర్వహణ చేపట్టేందుకు ఈ నెల 13 నుంచి పది రోజుల పాటు ప్రత్యేక పారిశుద్ధ్య డ్రైవ్ చేపట్టామని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు.



# వ్యాపారిపై టీచర్ బూతు పురాణం

- మంత్రి మనిషినంటూ అధికార దుర్వినియోగం
- సీసీ కెమెరాలు ధ్వంసం ఆపై వీరంగం
- ఏసిపికి సైతం ఫోన్ చేసి బెదిరింపులు
- కలకలం సృష్టించిన స్కూల్ అసిస్టెంట్ నిర్వాకం
- ఉపాధ్యాయుని విధుల నుంచి సస్పెండ్ చేసిన కలెక్టర్

08



06

# నకిలీ డిడిల వ్యవహారంపై విచారణ

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరు మండలంలోని ఇసుక ర్యాంపుల వద్ద నకిలీ డిడిల వ్యవహారం సంచలనం రేపుతోంది. ఈ అంశంపై శనివారం ఇంటిలిజెన్స్, పోలీస్ శాఖలు రంగంలోకి దిగాయి. నకిలీ డిడిల సమాచారం మేరకు అశ్వాపురం సీఐ అశోక్ రెడ్డి, ఇంటలిజెన్స్ అధికారి రామారావులు కలిసి రామానుజ వరం ఇసుక ర్యాంపు వద్ద విచారణ చేపట్టారు.



# రైతే రాజు

## ఇదే ఇందిరమ్మ ప్రభుత్వ లక్ష్యం

## మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి

**నేలకొండపల్లి, మహా:** రైతును రాజును చేయడం, పేదలకు సొంత ఇల్లు ఇవ్వడం, ప్రతి అర్హుడికి రేషన్ కార్డు, సంక్షేమ ఫలాలు అందించడమే ఇందిరమ్మ ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర రెవెన్యూ, హౌజింగ్, సమాచార పౌరసంబంధాల శాఖల మంత్రివర్యులు పొంగులేటి శ్రీనివాస రెడ్డి అన్నారు. శనివారం నేలకొండపల్లి మండలంలో పర్యటించి మంత్రి పలు అభివృద్ధి కార్యక్రమాలకు అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి తో కలిసి శంకుస్థాపన చేశారు. ముజ్జుగూడెం గ్రామంలో ముజ్జుగూడెం నుండి గువ్వలగూడెం వరకు రూ. 2.60 కోట్ల అంచనా వ్యయంతో బీటీ రోడ్డు, పైనంపల్లి గ్రామంలో రూ.15 లక్షల అంచనా వ్యయంతో అంతర్గత సీసీ రోడ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ప్రజా ప్రభుత్వం ఏర్పడ్డ నాటినుండి ముజ్జుగూడెం గ్రామంలో 3.68 కోట్ల రూపాయలతో వివిధ రోడ్లు మంజూరు చేసుకొని కొన్ని పూర్తి చేసుకున్నట్లు, కొన్ని టెండర్ దశలో ఉన్నాయని అన్నారు. పైనంపల్లి గ్రామంలో 12.59 కోట్లతో రోడ్లు, వివిధ అభివృద్ధి పనులు చేసుకున్నట్లు మంత్రి తెలిపారు. ప్రజా ప్రభుత్వం ఏర్పడే నాటికి ఆర్థిక పరిస్థితి బాగా లేకపోయినా అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు అమలులో వెనక్కి తగ్గడం లేదని అన్నారు. ఆర్థిక పరిస్థితిని బాగు చేస్తూ 200 యూనిట్ల ఉచితవిద్యుత్, 500 రూపాయలకు గ్యాస్ సిలిండర్, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించామన్నారు. 25 లక్షల మంది రైతులకు 2 లక్షల వరకు రుణమాఫీ క్రింద 21 వేల కోట్లు ప్రభుత్వం ఏర్పడ్డ 9 నెలల్లోనే అందించామన్నారు. రైతు భరోసా సహాయం 12 వేలకు పెంచినట్లు, పోయిన నెలలో ఒకేసారి 9 రోజుల్లో 9 వేల కోట్లు రైతుల ఖాతాల్లో జమచేశామన్నారు. రేషన్ కార్డుదారులకు సన్న బియ్యం సరఫరా, 11 లక్షల నూతన రేషన్ కార్డుల జారీ, పాత రేషన్ కార్డులలో 17 లక్షల కొత్త పేర్లు నమోదు వంటి అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్నామని అన్నారు. పాలేరు నియోజకవర్గంలో 3500 ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేశామన్నారు. రాబోయే 3 సంవత్సరాలలో మూడు విడతల్లో అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇండ్లు అందిస్తామని అన్నారు. ప్రతి సోమవారం ఇళ్ళు కట్టుకున్న స్టేజిని బట్టి డబ్బులు లబ్దిదారుని ఖాతాలో జమ చేస్తున్నామన్నారు. పేదల పక్షపాతి ఇందిరమ్మ ప్రభుత్వమని, ప్రజలు ఆదరించి, ప్రభుత్వానికి వెన్నంటి ఉండాలని మంత్రి అన్నారు.



# పేదల పక్షపాతి ప్రజా ప్రభుత్వం

## మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి



**తిరుమలాయపాలెం, మహా:** పేదల పక్షపాతి, పేదవాడికి అండగా, పేదవాడి కోసం పనిచేసే ప్రభుత్వమే మన ఇందిరమ్మ ప్రభుత్వమని రాష్ట్ర రెవెన్యూ, హౌజింగ్, సమాచార పౌరసంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి అన్నారు. శనివారం తిరుమలాయపాలెం మండలంలో పర్యటించి మంత్రి పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేశారు. పాతర్లపాడు గ్రామంలో పాతర్లపాడు నుండి లకావత్ తండా వరకు రూ. 1.32 కోట్ల అంచనా వ్యయంతో బీటీ రోడ్డు, జోగులపాడు గ్రామంలో జోగులపాడు నుండి తిలావత్ తండా వరకు రూ. 90 లక్షల అంచనా వ్యయంతో బీటీ రోడ్డు, రూ.10 లక్షల అంచనా వ్యయంతో అంతర్గత సీసీ రోడ్లు, జల్లెపల్లి గ్రామంలో రూ. 30 లక్షల అంచనా వ్యయంతో అంతర్గత సిసి రోడ్లు, హైదర్ సాయిపేట గ్రామంలో రూ. 10 లక్షల అంచనా వ్యయంతో అంతర్గత సిసి రోడ్ల నిర్మాణ పనులకు మంత్రి శంకుస్థాపనలు చేశారు. ప్రజా ప్రభుత్వం ఏర్పడే నాటికి ఆర్థిక పరిస్థితి బాగా లేకపోయినా అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు అమలులో వెనక్కి తగ్గడం లేదని అన్నారు. ఆర్థిక పరిస్థితిని బాగు చేస్తూ 200 యూనిట్ల ఉచిత విద్యుత్, 500 రూపాయలకు గ్యాస్ సిలిండర్, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించామన్నారు. 25 లక్షల మంది రైతులకు 2 లక్షల వరకు రుణమాఫీ క్రింద 21 వేల కోట్లు ప్రభుత్వం ఏర్పడ్డ 9 నెలల్లోనే అందించామన్నారు. రైతు భరోసా సహాయం 12 వేలకు పెంచినట్లు, పోయిన నెలలో ఒకేసారి 9 రోజుల్లో 9 వేల కోట్లు రైతుల ఖాతాల్లో జమ చేశామన్నారు. రేషన్ కార్డుదారులకు సన్న బియ్యం సరఫరా, 11 లక్షల నూతన రేషన్ కార్డుల జారీ, పాత రేషన్ కార్డులలో 17 లక్షల కొత్త పేర్లు నమోదు వంటి అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్నామని అన్నారు. సన్న వడ్లు పండించిన రైతులకు మద్దతు ధరతో పాటు క్వింటాకు 500 రూపాయల బోనస్ మొదటి విడత అందించామని, రెండో విడత అందించనున్నట్లు అన్నారు. గత ప్రభుత్వం పేదలకు సొంతిల్లు అందించే పథకం నిర్లక్ష్యం చేసిందని, ప్రజా ప్రభుత్వంలో 22 వేల 500 కోట్లతో 4.5 లక్షల ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేసామని అన్నారు. పాలేరు నియోజకవర్గంలో 3500 ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేశామన్నారు. రాబోయే 3 సంవత్సరాలలో మూడు విడతల్లో అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇండ్లు అందిస్తామని అన్నారు. ప్రతి సోమవారం ఇళ్ళు కట్టుకున్న స్టేజిని బట్టి డబ్బులు లబ్దిదారుని ఖాతాలో జమ చేస్తున్నామన్నారు. అన్నారు. విద్య, వైద్యానికి ప్రజాప్రభుత్వం పెద్ద పీట వేసిందని మంత్రి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్ అండ్ బి ఎస్ఇ యాకోబు, ఖమ్మం ఆర్డీవో నర్సింహారావు, పాలేరు నియోజకవర్గ ప్రత్యేక అధికారి రమేష్, పీఆర్ ఇఇ మహేష్ బాబు, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# పోలీసుల సమక్షంలో దాడి

## ప్రజాస్వామ్యానికి గొడ్డలి పెట్టు.. కాంగ్రెస్ నాయకులు గోపి



**మణుగూరు, మహా:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరు పోలీసుల సమక్షంలోనే రైతుపై దాడి చేయడం ప్రజాస్వామ్యానికి, చట్టానికి గొడ్డలి పెట్టు వంటిదని జిల్లా కాంగ్రెస్ నాయకులు గురజాల గోపి ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం మణుగూరులోని కాంగ్రెస్ పార్టీ రేణుకా చౌదరి క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, పినపాక నియోజకవర్గం మణుగూరు మండల పరిధిలోని కమలాపురం గ్రామానికి చెందిన రైతు, సింగరేణి ఉద్యోగి నాగేశ్వరరావుపై పోలీస్ స్టేషన్‌లో సీఐ, ఎస్ఐ మరో ఇద్దరు కానిస్టేబుల్ సమక్షంలో బినామీ కాంట్రాక్టర్ గంట రమేష్ దాడి చేయడం అత్యంత దారుణమని అన్నారు. గ్రామ ప్రజలు ఇసుక లారీలతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, విద్యార్థులు, బాటసారులు, రైతులు, స్థానికులు ప్రతిరోజూ ప్రాణభయంతో జీవించాల్సి వస్తోందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు ఎండి షరీఫ్, పింగళి మాధవరెడ్డి, చారి, మహిళా నాయకులు రేణుక అక్షర మహిళా మండలి అధ్యక్షురాలు పూనం సరోజ, ఎండి షబానా, కోరి శ్యామల, రెడ్డి బోయిన రేణుక, దేరంగుల కన్నాపురం వసంత, కన్నాపురం శైలజ, డాకూరి సౌజన్య, దేరంగుల సుజాత తదితర పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

# సింగరేణి సేవాసమితి సేవలు స్ఫూర్తిదాయకం

## ఏరియా ఎస్ఓ టు జిఎం శ్రీనివాసాచారి..



**మణుగూరు, మహా :** సింగరేణి సేవా సమితి ఆధ్వర్యంలో చేస్తున్న సేవలు స్ఫూర్తిదాయకమని మణుగూరు ఏరియా ఎస్ఓటు జిఎంబి శ్రీనివాసా చారి అన్నారు. శనివారం సంతోష్ నగర్‌లోని శ్రీ విద్యాభ్యాస పాఠశాలకు క్వింటా బియ్యం, అమ్మ నాన్న వృద్ధాశ్రమానికి యాభై కిలోలు బియ్యంను సేవ సమితి ఆధ్వర్యంలో అందజేశారు. ఈ సందర్భంగా శ్రీ విద్యాభ్యాస పాఠశాలలో జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడారు. చీకటి బ్రహ్మానందం – సూర్య వర్ధనమ్మ దంపతుల కుమారుడు సర్వేష్ లను ఆయన అభినందించారు. ఆదివాసీ నిరుపేద విద్యార్థులను, భావిభారత పౌరులుగా తీర్చిదిద్దే బృహత్తర కార్యక్రమానికి సేవ ద్వారా సహకారం అందించడం సంతోషకరమన్నారు.

# యజ్ఞంలా పారిశుద్ధ్య పనులు

## కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి



**ఖమ్మం,మహా:** నగరంలో మరింత మెరుగ్గా పారిశుద్ధ్య నిర్వహణ చేపట్టేందుకు ఈ నెల 13 నుంచి పది రోజుల పాటు ప్రత్యేక పారిశుద్ధ్య డ్రైవ్ చేపట్టామని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. నగరంలో శనివారం ఉదయం మున్సిపల్ కమీషనర్ అభిషేక్ అగస్త్య తో కలిసి బైపాస్ రోడ్, సారధినగర్, ఎఫ్.సి.ఐ. గోడౌన్ రోడ్ ల నందు కలినడకన తిరుగుతూ జిల్లా కలెక్టర్ పర్యటించారు. రోడ్ లకు ఇరువైపులా సైడ్ డ్రైన్ లు, చెత్త, పిచ్చి మొక్కలు, మట్టి పేరుకుపోయిన రోడ్డులను కలెక్టర్ పరిశీలించారు. నగరంలో చేపట్టే ప్రత్యేక పారిశుద్ధ్య నిర్వహణ కార్యక్రమాన్ని పకడ్బందీగా అమలు చేయాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. అనంతరం ప్రధాన రహదారులు, సెంట్రల్ డివైడర్స్, జంక్షన్ నందు పేరుకపోయిన మట్టిని శుభ్రపరిచే అధునికమైన పవర్ స్వీపింగ్ యంత్రాల పని తీరును ఎఫ్.సి.ఐ. గోడౌన్ రోడ్డులో క్షేత్రస్థాయిలో కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ ఖమ్మం నగరాన్ని సుందరంగా తీర్చిదిద్దాలని నగర వ్యాప్తంగా పేరుకు పోయిన చెత్తను శుభ్రం చేసి, మురుగునీరు నిల్వకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. నగరంలోని ప్రధాన రోడ్లు, అంతర్గత రోడ్లలో ఎక్కడ చెత్త ఉండకుండా శుభ్రం చేయాలని, వర్షాల వల్ల పేరుకుపోయిన మట్టి తొలగించాలని అన్నారు. కార్మికులు, జవాన్ వారీగా రోజుకు డివిజన్ల్ లో ఏ ప్రాంతంలో ఎంతమేర రోడ్లు, కాలువలు శుభ్రం చేయాలో కార్యాచరణ చేయాలని అన్నారు. మున్సిపల్ శాఖ లోని ప్రతి ఒక్కరూ ప్రత్యేక శ్రద్ధతో పారిశుద్ధ్య డ్రైవ్ చేపట్టాలని అన్నారు. చెత్త తో ఉన్న ప్రాంతాలను శుభ్రం చేసే ముందు, శుభ్రం చేసి తర్వాత ప్రజలకు తేడా తెలిసేలాగా ప్రత్యేక పారిశుద్ధ్య నిర్వహణకు అవసరమైన అదనపు కార్మికులు, జెసీబీలు, ట్రాక్టర్, స్వీపింగ్ యంత్రాలను అందుబాటులో ఉంచుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కమీషనర్ అనిల్ కుమార్, మునిసిపల్ ఇఇ కృష్ణలాల్, గ్రీనరీ అధికారిణి రాధిక, శానిటేషన్ ఇన్స్పెక్టర్లు, సూపర్వైజర్ లు, జవాన్ లు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# సహస్ర ట్రేడర్స్ ప్రారంభించిన ఎమ్మెల్యే కోరం కనకయ్య



**టేకులపల్లి - మహా:** టేకులపల్లి మండలం గోలియా తండ గ్రామంలో భూక్య సురేష్ సహస్ర ట్రేడర్స్‌ను ప్రారంభించిన ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య ఈ కార్యక్రమం లో పిఎసిఎస్ చైర్మన్ లక్కినేని సురేందర్ రావు కాంగ్రెస్ నాయకులు కోరం సురేందర్, ఆత్మ కమిటీ చైర్మన్ బోడ మంగీలాల్ నాయక్ టేకులపల్లి ఎస్సై రాజేందర్ మండల నాయకులు ఈది గణేష్ రెడ్యానాయక్, పోషాలు సంజయ్ నాయక్, పుణ్య నాయక్, భూక్య శ్రీను, హరి, పెరుగు సత్యనారాయణ, భూక్య ఉమేష్, బానోత్ బాబు రావు తదితరులు పాల్గొన్నారు

# ఖమ్మం జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడి పదవికి పగడాల లచ్చిరెడ్డి దరఖాస్తు



**తల్లాడ, మహా:** ఖమ్మంజిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్ష(డీసీసీ) బాధ్యతలను తనకు అప్పగించాలని ఖమ్మం జిల్లా తల్లాడ మండలంలోని రంగం బంజర గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పగడాల లచ్చిరెడ్డి దరఖాస్తు చేసుకున్నారు. ఈ మేరకు శనివారం ఖమ్మంకు వచ్చిన అఖిలభారత కాంగ్రెస్ కమిటీ (ఏఐసిసి) పరిశీలకులు మహేంద్ర న్ కు ఆయన దరఖాస్తు పత్రం అందించారు. గత 25ఏళ్లకు పైగా కాంగ్రెస్ పార్టీకి జిల్లాలో సేవలందించానని గుర్తు చేశారు. కాంగ్రెస్ పార్టీ తల్లాడ మండల మాజీ అధ్యక్షులుగా పనిచేయడంతో పాటు వైరా వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ గా విధులు నిర్వహించినట్లు వెల్లడించారు. అనేకమంది ముఖ్య నాయకులతో అనుచరుడుగా ఉంటూ తల్లాడ మండలంలో పార్టీ బలోపేతమే లక్ష్యంగా విధులు నిర్వహించారు. ఖమ్మం జిల్లా వ్యాప్తంగా తనకు ప్రత్యేకమైన గుర్తింపు ఉందని, జిల్లా కాంగ్రెస్ డిసిసి అధ్యక్షులుగా తనకు బాధ్యతలు ఇవ్వాలని ఈ మేరకు పరిశీలకులకు ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ విషయాన్ని ఏఐసీసీ పెద్దల దృష్టికి తీసుకెళ్తానని పరిశీలకులు చెప్పినట్లు లచ్చిరెడ్డి తెలిపారు.

# స్కూల్ అసిస్టెంట్ సస్పెండ్

**ఖమ్మం,మహా:** నేలకొండపల్లి మండలం సుర్దేపల్లి మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్‌గా పనిచేస్తూ, ప్రస్తుతం జిల్లా విద్యాధికారి కార్యాలయంలో డిప్యుటేషన్ పై పనిచేయుచున్న టి. లక్ష్మణ్ రావు ను సస్పెండ్ చేస్తూ జిల్లా విద్యాధికారిణి, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డా. పి. శ్రీజ శనివారం ఉత్తర్వులు జారీచేశారు. టి. లక్ష్మణ్‌రావు, స్కూల్ అసిస్టెంట్, తన హెడ్‌క్వార్టర్ వదిలి కొణిజర్ల సమీపంలోని క్రాకర్స్ దుకాణానికి వెళ్లి, ఇతరులతో కలిసి వాగ్వివాదం చేయటంతో పాటు, అసభ్యపదజాలంతో దూషించి, సీసీ టివి కెమెరాలను ధ్వంసం చేసిన ఆరోపణలపై, కొణిజర్ల పోలీస్ స్టేషన్‌లో క్రిమినల్ కేసు నమోదయినట్లు జిల్లా విద్యాధికారిణి అన్నారు. తెలంగాణ సివిల్ సర్వీస్ కండక్ట్ రూల్స్‌కు విరుద్ధంగా ప్రవర్తించినందుకు, తన చట్టబద్ధమైన విధుల నిర్వహణలో నిర్లక్ష్యం, శాఖ ప్రతిష్టను భంగపరిచే చర్యలకై సస్పెన్షన్ చేస్తున్నట్లు ఆ ఉత్తర్వుల్లో జిల్లా విద్యాధికారిణి పేర్కొన్నారు.

# ఆలయ అభివృద్ధికి విశేష కృషి

## ఎమ్మెల్యే మాలోతు రామదాస్ నాయక్ భరోసా

**ఏన్కూర్, మహా:** ఏన్కూర్ మండలం నాచారం గ్రామంలోని పురాతన శ్రీ అద్భుత వెంకటేశ్వర స్వామి దేవాలయం త్వరలో భక్తి క్షేత్రంగా మరింత అభివృద్ధి చెందనుందని వైరా ఎమ్మెల్యే మాలోతు రామదాస్ నాయక్ తెలిపారు. శనివారం ఎమ్మెల్యే దంపతులు ఆలయాన్ని దర్శించుకొని స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ – "నాచారం వెంకటేశ్వర ఆలయానికి చారిత్రక ప్రాధాన్యం ఉంది. ప్రతి కోరికను తీర్చే అద్భుత స్వామిగా ప్రజలు విశ్వసిస్తున్నారు. భక్తుల సౌకర్యాల కోసం దేవాదాయ శాఖతో సమన్వయం చేసుకుంటూ కొత్త కమిటీని ఏర్పాటు చేసి అభివృద్ధి పనులు ప్రారంభిస్తాం.



శిల్పులు, నిపుణులతో కలిసి దేవాలయానికి ఆధ్యాత్మిక శోభను చేకూరుస్తాం" అన్నారు. అలాగే ఎమ్మెల్యే దంపతులు వీరభద్రస్వామి, పద్మావతి అమ్మవారి ఆలయాల్లో కూడా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు స్వర్ణ నరేందర్, నాయకులు గుత్త వెంకటేశ్వరరావు, వేముల కృష్ణ ప్రసాద్, మార్కెట్ కమిటీ చైర్మన్ గుగులోతు లచ్చిరాం నాయక్, మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు కొప్పుల ప్రభావతి రెడ్డి, మేడ ధర్మారావు, వక్కంతుల నాగార్జున, వక్కంతుల సాగర్, పంతగాని నరేష్, దళపతి భువనేశ్వర్ రాజు, తాళ్లూరు నవీన్, గిద్ద గిరి సత్యనారాయణ, బగ్గ నాయక్, నాగరాజు పాల్గొన్నారు.

# ఎంపీ వద్దిరాజుకు సత్కారం

**ఖమ్మం, మహా:** బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ డిప్యూటీ లీడర్, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్రను మున్నూరుకాపు సంఘం తెలంగాణ డైరీ ఆవిష్కరణ కమిటీ చైర్మన్, రాష్ట్ర అధికార ప్రతినిధి మంగళారావు లక్ష్మణ్ పటేల్, వైస్ చైర్మన్, రాష్ట్ర కార్యదర్శి ఇనపల్లి వెంకన్న పటేల్,



రాష్ట్ర కార్యనిర్వాహణ కార్యదర్శి ఆకుల సత్యనారాయణ పటేల్, రాష్ట్ర ఉపాధ్యక్షులు పర్వతం సతీష్ పటేల్, మండల అధ్యక్షులు చాట్లపల్లి నర్సింగ్ రావు పటేల్ తో పాటు రాష్ట్ర అధ్యక్షులు సర్దార్ పుట్టం పురుషోత్తమ రావు పటేల్ తదితర ప్రముఖులు శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా వారు మున్నూరుకాపు సంఘం తెలంగాణ నూతన సంవత్సరం–2026 డైరీ ప్రచురణ గురించి ఎంపి రవిచంద్ర దృష్టికి తెచ్చారు.ఇందుకు ఎంపీ వద్దిరాజును సహకారం కోరగా,ఆయన సానుకూలంగా స్పందించారు.

## బిజెపి జిల్లా పదవులు చేపట్టిన వారికి శుభాకాంక్షలు

**తల్లాడ, మహా:** ఖమ్మం జిల్లా భారతీయ జనతా పార్టీ నూతన కమిటీ బాధితులు నియమితులైన ప్రతి ఒక్కరికి హృదయపూర్వక ధన్యవాదాలు తెలుపుతున్న, రాయల రమేష్ చౌదరి, సత్తుపల్లి నియోజకవర్గం నుండి జిల్లా ప్రధాన కార్యదర్శిగా నియమితులైన నాయుడు రాఘవరావు కి ఉపాధ్యక్షులుగా నియమితులైన వీర రాజుకి సుదర్శన మిత్ర సేనాకి జిల్లా ప్రధాన కార్యదర్శిగా నియమితులైన నాగ సురేంద్ర రెడ్డికి హృదయపూర్వక ధన్యవాదాలు సత్తుపల్లి నియోజకవర్గం కు తగిన ప్రాధాన్యత ఇచ్చిన జిల్లా అధ్యక్షుడు నెల్లూరు కోటేశ్వరావు కి



ధన్యవాదాలు తెలుపుతున్న తల్లాడ మండలం బిజెపి ప్రధాన కార్యదర్శి రాయల రమేష్ చౌదరి, వారు పదవులకు ప్రజలకు అనుసందంగా ఉండి గౌరవం ఇవ్వాలని ప్రజలతో కలిసిమెలిసి ఉండి పార్టీని ముందుకు తీసుకెళ్లాలని బిజెపి పార్టీ నుండి కోరుకుంటున్నాను.

## ప్రభుత్వ ఐటిఐలో 5వ విడత వాక్-ఇన్ ప్రవేశాలు

మణుగూరు, మహా : మణుగూరు ప్రభుత్వ ఐటిఐ, ఏటీసీలో 2025 విద్యా సంవత్సరానికి మిగిలిన సీట్ల భర్తీ కోసం 5వ విడత వాక్–ఇన్ ప్రవేశాలు నిర్వహిస్తున్నట్లు ఐటిఐ ప్రిన్సిపాల్ జి రవి తెలిపారు. ఈ మేరకు శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 10వ తేదీ నుంచి అభ్యర్థులు ఆన్లైన్లో దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. ఆన్లైన్లో దరఖాస్తు చేసిన విద్యార్థులు అక్టోబర్ 13 నుండి 17 వరకు మధ్యాహ్నం 1 గంటకు నేరుగా ఐటిఐ కార్యాలయానికి హాజరై ప్రవేశం పొందవచ్చని ఆయన తెలిపారు. దరఖాస్తులు చేసుకోవాలనుకునే అభ్యర్థులు http://iti.telangana.gov.in వెబ్సైట్ ద్వారా ఆన్లైన్లో నమోదు చేసుకోవాలని ప్రిన్సిపాల్ రవి సూచించారు. ఈ అవకాశాన్ని పినపాక నియోజకవర్గంలోని యువతీ, యువకులు సద్వినియోగం చేసుకుని తమ భవిష్యత్తుకు బంగారు బాటలు వేసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు.

## పీఎం దన్ ధాన్య కృషి పథకాన్ని వీక్షిస్తున్న పిఎసిఎస్ చైర్మన్

**టేకులపల్లి - మహా :** పిఎసిఎస్ బేతంపూడి సంఘము ఆధ్వర్యంలో పి ఎం దన్ ధాన్య కృషి పథకంలో భాగంగా దేశవ్యాప్తంగా వ్యవసాయరంగా పశు సంవర్ధక మత్స్య ఆహార ప్రాసెసింగ్ ప్రాజెక్ట్ కింద వెనుకబడిన వంద జిల్లాలను దేశ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ప్రారంభించారు ఈ కార్యక్రమంలో పిఎసిఎస్ చైర్మన్ లక్కినేని సురేందర్ డైరెక్టర్ ఉదయ్ భూక్య బాలాజీ దోర్నాల విజయ్ మోహన్ సంఘ సిబ్బంది రైతులు ఐ ఎఫ్ ఎఫ్ సి ఓ పంపిణీ తరపున కందుల ప్రేమ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు





## చర్చిని కూల్చిన దుండగులను కఠినంగా శిక్షించాలి

**బోనకల్ మహా:** గోవిందపురం గ్రామంలో లక్ష్మీపురం రెవిన్యూ లో ఇంటిగ్రేటెడ్ స్కూల్ సమీపంలో 401 ప్రభుత్వ భూము లో కొత్తపల్లి రాంబాబు గత మూడు సంవత్సరాల నుంచి రేకుల షెడ్ నిర్మించుకొని సంఘం ఏర్పాటు చేసుకొని ప్రార్థన నిర్వహిస్తున్నాడు అక్కడ కాంక్రీట్ తో శిలువను కూడా నిర్మించుకున్నాడు గురువారం రాత్రి 9:30 సమయంలో గుర్తుతెలియని వ్యక్తులు జెసిబి సాయంతో వచ్చి అక్కడున్న టువంటి ఏసుప్రభు సిలువను రేకుల షెడ్డు ను ధ్వంసం చేశారు సిలువను ఎన్ఎస్పి కాలంలో వేయడం జరిగింది ఈ సంఘటనలు జరగడం దురదృష్టకరం ఈ గ్రామం అసలే సమస్యాత్మక గ్రామముగా ఉన్నది ఇలాంటి చర్యలు శాంతి భద్రతలు విఘాతం కల్పించడానికి కొంత మంది సంఘ విద్రోహ శక్తులు ఇలాంటి సంఘటన ప్రోత్స హిస్తుంది ఈ సంఘటనలను కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా ఖండిస్తోంది.

## సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌పై అధికారులు దాడులు

**ఖమ్మం సిటీ, మహా:** ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని వివిధ డివిజన్‌లలో మున్సిపల్ అధికారులు శనివారం సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగంపై ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా పలు దుకాణాల్లో నిషేధిత ప్లాస్టిక్ వస్తువులు ఉపయోగిస్తున్నట్లు గుర్తించారు. తనిఖీల్లో మొత్తం రూ.45,000 జరిమానా విధించారు. మిస్సాన్ క్లాత్ స్టోర్‌కు రూ.4,000, సాంబయ్య మటన్ షాప్‌కు రూ.3,000, బిర్యానీ పాయింట్‌కు రూ.8,000, కృష్ణవేణి మెస్‌కు రూ.5,000, సి & డి వ్యర్థాల నిర్వహణలో ఉన్న నాలుగు కేసులపై రూ.25,000 జరిమానాలు విధించారు. అధికారులు సుమారు 5 కిలోల సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను స్వాధీనం చేసుకున్నారు. ప్రజలు, వ్యాపారులు నిషేధిత ప్లాస్టిక్‌ను ఉపయోగించరాదని, పర్యావరణ పరిరక్షణ కోసం సహకరించాలని మున్సిపల్ అధికారులు విజ్ఞప్తి చేశారు.

## ప్రజా సమస్యలు పరిష్కరించాలి: బత్తుల వెంకటేశ్వర్లు

**బూర్గంపహాడ్ మహా:** బూర్గంపాడు మండలం సారపాక మేదే కాలనీలో సిపిఐ పార్టీ బృందం సందర్శించారు. రోడ్లు డ్రైనేజీలు మంచినీళ్లుకరెంటు సమస్యలతో ఇబ్బందులకు గురవుతున్నారని అన్నారు. సిపిఎం పార్టీ మండల కార్యదర్శి బత్తుల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ గతంలో ఈ రోడ్డు గురించి నియోజవర్గ ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వరావుకి వినతి పత్రం గత మూడు నెలల క్రితం ఇచ్చాం వారు హామీ ఇచ్చారు కానీ



ఇంతమంటికి ఆ రోడ్డుకి మట్టిగాని డ్రైనేజీలు కాలువలు తీపించం లేదు , కరెంటు స్తంభం, మంచినీళ్ల సమస్య కూడా ఉందని అన్నారు, స్తంభం ఒకటి వేయాల్సిన అవసరం ఉంది అన్నారు.ఈ కార్యక్రమంలో పార్టీ మండల కమిటీ సభ్యులు పాపినేని సరోజన, అబిదా బత్తుల గోపాలరావు రావుల పెల్లి వీరయ్య దోషణ పెంటమ్మ రేణుక సరూప కుమారి సతీష్ తదితరులు పాల్గొన్నారు

## మధ్యాహ్న భోజన పథకం వర్కర్లకు నెలకు 10000 రూపాయలు ఇవ్వాలి

**తల్లాడ, మహా:** తెలంగాణ రాష్ట్రంలో మధ్యాహ్న భోజన పథకంలో పనిచేస్తున్న వర్కర్లకు కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ ప్రకారం నెలకు పదివేల రూపాయలు చెల్లించాలని మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ (ఏఐటియుసి)రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి సత్తెనపల్లి విజయలక్ష్మి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తల్లాడ మండల కేంద్రంలో జీఎన్ఆర్ ఫంక్షన్ హాల్ లో సంఘం నాయకురాలు మహదేవ లక్ష్మి, తాళ్లూరి లక్ష్మిల అధ్యక్ష వర్గంగా రెండవ మహాసభ జరిగింది. మహాసభలకు ప్రారంభ సూచకంగా జెండా ఆవిష్కరించి అనంతరం ఆమె మాట్లాడుతూ ప్రస్తుతం తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు 54 వేలమంది మధ్యాహ్న భోజన పథకంలో వర్కర్లు పనిచేస్తున్నారన్నారు.

## పోలీస్ స్టేషన్లో దాడి ఘటనపై.. ఎస్పీకి ఫిర్యాదు చేసిన రేగా



**మణుగూరు, మహా :** మణుగూరు పోలీస్ స్టేషన్లో ఇసుక ర్యాంపు నిర్వాహకుడు రైతుపై చేసిన దాడి ఘటనపై బిఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, పినపాక మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు జిల్లా ఎస్పీ రోహిత్ రాజ్ కి ఫిర్యాదు చేశారు. శనివారం ఈ విషయమై జిల్లా ఎస్పీని కలిశారు. పోలీసులు చూస్తుండగానే దాడి జరగడం దుర్మార్గమని, ఘటనకు కారణమైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన ఎస్పీని కోరారు. రైతు, సింగరేణి ఉద్యోగి నాగేశ్వరరావుపై జరిగిన దాడి పోలీసు వ్యవస్థపై ప్రజల నమ్మకాన్ని దెబ్బతీసేలా ఉందని రేగా ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజలకు రక్షణ కల్పించాల్సిన పోలీసులు మౌనం వహించడం సరికాదని ఆయన వ్యాఖ్యానించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే రేగాతో పాటు బిఆర్ఎస్ నాయకులు జీవి, సాంబశివరావు, సోమేశ్వర్ గౌడ్, పొన్నాల రాములు, కట్టా రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

### బెస్ట్ అవైలబుల్ స్కీం కింద 26 వేల మంది

## ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు రోడ్డున

**ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల విద్యకు దూరం!**



**వైరా, మహా:** రెండేళ్లుగా రూ. 220 కోట్ల బకాయిలను చెల్లించకపోవడంతో రాష్ట్రవ్యాప్తంగా 230 ప్రైవేట్ పాఠశాలల్లో చదువుతున్న దళిత, గిరిజన విద్యార్థులు రోడ్డున పడ్డారని తెలంగాణ గిరిజన సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి, ఖమ్మం జిల్లా ప్రధాన కార్యదర్శి భూక్యా వీరభద్రం తెలిపారు. ప్రభుత్వం బకాయిలు చెల్లించేంతవరకు పాఠశాలల్లోకి విద్యార్థులను రానివ్వమని అక్టోబర్ 6వ తేదీ నుండి ప్రైవేట్ పాఠశాల యాజమాన్యాలు రాష్ట్రవ్యాప్తంగా సమ్మెకు దిగినట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో అక్టోబర్ 13న హైదరాబాద్‌లో ఉద్యమ కార్యాచరణకై రౌండ్ టేబుల్ సమావేశం జరుగుతుందని చెప్పారు. ఈ సమావేశాన్ని కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం, తెలంగాణ గిరిజన సంఘం, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీలు సంయుక్తంగా నిర్వహిస్తున్నాయని, రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అన్ని దళిత, గిరిజన, విద్యార్థి, ప్రజా సంఘాలు పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు.

# అక్రమ ఇసుక ట్రాక్టర్ల వేగంతో రోడ్డు ప్రమాదాలు

- ట్రాక్టర్ల వేగానికి కళ్లెం వేసేది ఎవరు
- ఈస్ట్ కోస్ట్,చెన్నై సూపర్ ఫాస్ట్ ఎక్స్ప్రెస్ ట్రైన్ల కంటే ట్రాక్టర్ల వేగంకు భయపడుతున్న ప్రయాణికులు
- ట్రాక్టర్లకు నెంబర్లు ఉండవు,పత్రాలు ఉండవు
- ఇన్సూరెన్స్ అంతకన్నా ఉండదు
- అధికారుల నిర్లక్ష్యమే ట్రాక్టర్ల వేగంకు పరాకాష్ట
- ఇసుక ట్రాక్టర్ల డ్రైవర్లగా మైనర్లు
- మద్యం మత్తులో ఇష్టారాజ్యం
- వల్లభి,ముదిగొండ,ఖమ్మం వెళ్లే రోడ్డు మీద ప్రయాణం చేయాలంటే భయపడుతున్న ప్రజలు,వాహనదారులు
- పెద్దమండవ రోడ్డు ప్రమాదానికి ఇసుక ట్రాక్టర్ డ్రైవర్ నిర్లక్ష్య డ్రైవింగ్ కారణం
- చిన్నారుల నిండు ప్రాణాలు బలి





**ముదిగొండ, మహా:** ఇసుక ట్రాక్టర్లు వేగానికి రోడ్డు మీద వెళ్లే,ప్రయాణికులు,వాహనదారులు ప్రజలు భయపడుతూ హడలెత్తి బీతిల్లుతున్నారు. మండలంలోని పెద్దమండవ, గంధసిరి మున్నేరుల నుండి నిత్య కళ్యాణం,పచ్చని తోరణంలా,ఇసుక అక్రమ రవాణా రాత్రి,పగలు అనే తేడా లేకుండా ఇసుక మూడు ట్రిప్పులు,33 ట్రాక్టర్లుతో ఖమ్మం, పరిసర ప్రాంతాలు, ముదిగొండ, కోదాడ, చింతకాని, నేలకొండపల్లి మండలాలకు 24 గంటలు ఇసుక తోలకాలు కొనసాగుతున్నాయి.ఇసుక తోలకాలు ముదిగొండ మండల అధికారుల కనుసన్నుల్లోనే జరగటం విశేషం.అధికారులకు కళ్ళముందే అక్రమ ఇసుక ట్రాక్టర్లు పోతున్న పట్టించుకోరు. ప్రధానంగా రెవిన్యూ అధికారులు ఎంత మాత్రం పట్టించుకోరు. వారికి అంత తీరిక లేదు.గత సంవత్సరం నుండి ముదిగొండ తహశీల్దారుగా బాధ్యతలు చేపట్టిన నాటినుండి మండలంలో ఇసుక అక్రమ రవాణా తోలకాలు అధికమైనవి.ఆ రెవిన్యూ అధికారి విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ ఉండటమే ఇసుక అక్రమ రవాణాకు అంతులేకుండా పోయింది.ప్రధానంగా ఇసుక డ్రైవర్ల మైనర్లగా ఉండి,ఈస్ట్ కోస్ట్,చెన్నై సూపర్ ఫాస్ట్ ఎక్స్ప్రెస్ ట్రైన్ల కంటే ఇక్కడ ఇసుక ట్రాక్టర్లు వేగం ఎక్కువ. రై,రైమంటూ రోడ్డుపై అతి వేగంగా వెళ్ళటంతో రోడ్డుపై రాకపోకలు కొనసాగించే ప్రయాణి కులు వాహనదారులు భయాందోళనకు గురవుతున్నారు. దీనికి తోడు మద్యం మత్తు డ్రైవర్ల ఇష్టారాజ్యం,నిర్లక్ష్య డ్రైవింగ్ తో,రోడ్డు ప్రమాదాలకు కారణమవుతున్నారు.ఇసుక ట్రాక్టర్ల వేగంకు అనేకమైన రోడ్డు ప్రమాదాలు జరిగాయి. ఇటీవల కాలంలో పెద్దమం డవ గ్రామానికి చెందిన ఓ ఇసుక ట్రాక్టర్ పమ్మి నుండి వెళుతూ చింతకాని మండలం తిమ్మినేనిపాలెం గ్రామానికి చెందిన ద్విచక్ర వాహనదారిని ఢీ కొట్టి ఆయన మృతికి కారణమైంది.ఇసుక ట్రాక్టర్లు ఖమ్మంలో అరలోడు చేసి గంధసిరి వెళుతున్న ట్రాక్టర్ అమ్మపేట రవీంద్ర భారతి స్కూల్ దగ్గర ధాన్యం బస్తాల లోడుతో ఆగి ఉన్న లారీని ఢీ కొట్టి ప్రమాదానికి కారణమైంది. శుక్రవారం రాత్రి పెద్దమండవ నుండి ద్విచక్ర వాహనంపై ఖమ్మం వెళుతున్న ముగ్గురు చిన్నారులు బైకును పెద్దమండవ గ్రామానికి చెందిన ఇసుక డాన్ ట్రాక్టర్ ఖమ్మంలో ఇసుక దిగుమతి చేసి గ్రామం వైపు వెళుతూ అదే రహదారిలో బైకును,ఢీ కొట్టి,ఇద్దరు చిన్నారుల మృతికి కారణమైంది.ఇలా చెప్పుకొని పోతే ఇసుక ట్రాక్టర్ల ప్రమాదాలు కో.కొల్లలుగా జరిగాయి.ఈ ట్రాక్టర్లకు నెంబర్ ప్లేట్లు ఉండవు. పత్రాలు ఉండవు. ఇన్సూరెన్స్ అంతకన్నా ఉండదు.ఇసుక అక్రమ దందాకు అధికారులు అడ్డుకట్ట వేయరు.ఇసుక ట్రాక్టర్ల వేగంకు పేద,మధ్యతరగతి కుటుంబాల జీవితాలు అర్ధాంతరంగా బలైపోతున్నాయి. వీటికి బాధ్యులు ఎవరు ..? అనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి.ఇసుక ట్రాక్టర్ల వేగానికి కళ్లెం వేసేది ఎవరు.అక్రమ ఇసుక దందాను నిర్మూలించేదెవరు అని మండల ప్రజలు ప్రశ్నిస్తున్నారు.అధికారుల చేతివాటంతో ఇసుక అక్రమ దందాకు హద్దు లేకుండా పోయిందని ప్రజలు విమర్శిస్తున్నారు. నెలనెల మామూళ్లకు అలవాటు పడిన ప్రభుత్వ అధికారులు మండలంలో అక్రమాలు ఏమి జరుగుతున్న పట్టించుకోకపోవడం గమనార్హం.ప్రభుత్వ స్థలాల్లో సైతం అక్రమ కట్టడాలు నిర్మాణం చేస్తున్నారని ఫిర్యాదు చేసిన తాహశీల్దార్ పట్టించుకోవటం లేదని ప్రజలు వాపోతున్నారు.ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు జోక్యం చేసుకొని మండలంలోని ఇసుక ట్రాక్టర్ల వేగానికి కళ్ళెం వేసి,అక్రమ ఇసుక, మట్టి దందా అరికట్టి,రోడ్డు ప్రమాదాలు జరగకుండా చేయాలని స్థానిక ప్రజలు కోరారు.

# అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలి



## రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

**ఖమ్మం, మహా:** అభివృద్ధి పనుల్లో వేగం పెంచి, నిర్ణీత సమయంలో పూర్తి చేయాలని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత, జౌళీ శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. మంత్రివర్యులు, శనివారం ఖమ్మం మున్సిపల్ కార్పోరేషన్ పరిధి 42వ డివిజన్ లో పర్యటించి మునిసిపల్ సాధారణ, టియుఎఫ్ఐడిసి నిధులు 92 లక్షలతో నూతనంగా నిర్మించనున్న సీసీ రోడ్లు, సీసీ సైడ్ డ్రైన్ లు, వాటర్ సప్లై పైప్ లైన్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ ఖమ్మం నగర కార్పొరేషన్ పరిధిలో మౌళిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నామని, ప్రజల సౌకర్యవంతమైన జీవనానికి సిసి రోడ్లు పెద్ద ఎత్తున నిర్మిస్తున్నామని, భవిష్యత్తుకు అనుగుణంగా కొత్త రోడ్లు, డ్రైయిన్లు నిర్మిస్తున్నామని తెలిపారు. 6వ డివిజన్ పరిధిలో పూర్తి స్థాయిలో రోడ్డు డ్రైన్ నిర్మాణ పనులు పూర్తి చేస్తామని అన్నారు. విద్యార్థులకు మెరుగైన విద్య అందించేందుకు రేవంత్ రెడ్డి ప్రభుత్వం చిత్తశుద్దితో ఉందని, బెస్ట్ అవెలెబుల్ స్కూల్ విద్యార్థులు, ఫీజు రిఅంబర్స్ మెంట్ సమస్యలను మంత్రి వర్గ క్యాబినెట్ లో చర్చించామని, గత ప్రభుత్వం చేసిన బకాయిల వలన ఈ ప్రభుత్వం పెద్ద మొత్తంలో అప్పులు చెల్లించవలసిన పరిస్థితి వచ్చిందన్నారు. విద్యార్థులు భవిష్యత్తు కోసం ముఖ్యమంత్రి నిధులు విడుదల చేస్తారని అన్నారు. నగరంలో చేపట్టిన అభివృద్ధి పనులు నాణ్యతతో సకాలంలో పూర్తి చేయాలని తెలిపారు. ఖమ్మం నగరాన్ని సుందరంగా తీర్చిదిద్దేందుకు ప్రజలంతా తమ వంతు సహకారం అందించాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, రోడ్ల వెడల్పుతో నగరం సుందరంగాను, ప్రజలకు సౌకర్యవంతంగాను ఉంటుందన్నారు. రోడ్ల వెడల్పు తో ప్రాంతం అభివృద్ధి చెందుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో నగర మేయర్ పునుకొల్లు నీరజ, డిప్యూటీ మేయర్ ఫాతిమా జోహర, స్థానిక కార్పోరేటర్ పాకాలపాటి విజయనిర్మల శేషగిరిరావు, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# రాహుల్ గాంధీ నేతృత్వంలో ప్రజా ఉద్యమం ప్రారంభం

- బీసీ రిజర్వేషన్ల కోసం కాంగ్రెస్ సంకల్పం
- రేవంత్ ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రగతి
- రాజ్యాంగ పరిరక్షణకు కాంగ్రెస్ ప్రతిజ్ఞ
- ఖమ్మం నియోజకవర్గంలో ఓట్ చోరీ
- సంతకాలపై మంత్రి తుమ్మల వ్యాఖ్యలు



**ఖమ్మం, మహా:** దేశ వ్యాప్తంగా బీజేపీ చేస్తున్న రాజ్యాంగ విరుద్ధం, ఓట్ చోరీ వికృత చారిత్రక చర్యలకు నిరసనగా, రాహుల్ గాంధీ నేతృత్వంలో ప్రజా ఉద్యమం రూపొందించాల్సిన అవసరం ఎంతైనా ఉందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఉద్ఘాటించారు.

మోడీ%–%అమిత్ షా దొంగ ఓట్లతో అధికారంలోకి వచ్చారని, మనకు నచ్చిన వారిని ఎన్నికల్లో ఎన్నుకోవాలంటే రాజ్యాంగాన్ని కాపాడుకోవాలి అని ఆయన స్పష్టంగా అన్నారు. ప్రత్యేకంగా, బీసీ రిజర్వేషన్ల పరిరక్షణ, తెలంగాణ అభివృద్ధి పథకాలు ప్రజలకు అందించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని చెప్పుకొచ్చారు. శనివారం నాడు ఖమ్మం నియోజకవర్గంలోని కాంగ్రెస్ పార్టీ విస్తృత స్థాయి సమావేశంలో మంత్రి తుమ్మల ఓట్ చోరీ సంతకాల కార్యక్రమంపై ప్రాధాన్యతా వ్యాఖ్యలు చేశారు. ఈ కార్యక్రమం దేశ వ్యాప్తంగా బీజేపీ చేస్తున్న రాజ్యాంగ విరుద్ధ వికృత చేష్టలకు ప్రతికూలంగా ఉంది. మోడీ%–%అమిత్ షా దొంగ ఓట్ల ద్వారా అధికారంలోకి వచ్చారని మంత్రి వ్యాఖ్యానించారు.

రాహుల్ గాంధీ నేతృత్వంలో, ప్రజల ఆత్మ గౌరవాన్ని కాపాడే దిశగా ఉద్యమ రూపంలో ముందుకు వెళ్లాల్సిన అవసరం ఉందని మంత్రి స్పష్టం చేశారు. కాంగ్రెస్ పార్టీ ఆదేశాల మేరకు, ఖమ్మం నియోజకవర్గంలో ఇంటింటికి వెళ్లి ఓట్ చోరీ సంతకాలు కార్యక్రమాన్ని చేపట్టాలని ముఖ్యమైన సూచన చేశారు. ఈ సందర్భంగా, "మనకు నచ్చిన వారిని ఎన్నికల్లో ఎన్నుకోవాలంటే రాజ్యాంగ సంస్థలను కాపాడుకోవాలి" అని తుమ్మల గుర్తుచేశారు. ప్రత్యేకంగా, బీసీ రిజర్వేషన్ల అంశంపై రాహుల్ గాంధీ ఉక్కు సంకల్పంతో ఉన్నారని, బీసీ లకు 42 శాతం రిజర్వేషన్లు ఇవ్వాల్సిన అవసరాన్ని స్పష్టంగా పేర్కొన్నారు. అంతేకాక, తెలంగాణ ప్రభుత్వం రేవంత్ రెడ్డి నాయకత్వంలో నడుపుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాల ప్రగతి పై కూడా మంత్రి ప్రశంసలు కురిపించారు. ఈ పథకాలు ప్రజల జీవితాలను సౌకర్యవంతంగా మార్చేలా ఉన్నాయని, బీసీ, దళిత, మహిళా వర్గాల సంక్షేమం కాపాడేందుకు సీఎం రేవంత్ పట్టుదలగా ఉన్నారని చెప్పారు. సమావేశంలో ఓట్ చోరీ సంతకాలు కార్యక్రమం ప్రజా ఉద్యమంలా సాగాలని ఉద్ఘాటిస్తూ, ఈ కార్యక్రమం స్థానిక ప్రజల్లో రాజకీయ చైతన్యాన్ని పెంచేలా ఉండాలని మంత్రి తుమ్మల అన్నారు. ఖమ్మం నియోజకవర్గంలో ప్రజలలో సమస్యల పట్ల అవగాహన, రాజ్యాంగ పరిరక్షణలో పాల్గొనాల్సిన చైతన్యాన్ని ఈ కార్యక్రమం అందిస్తుందనే విశ్వాసం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు పువ్వాల దుర్గాప్రసాద్, నగర అధ్యక్షులు జావిద్ తదితరులు పాల్గొన్నారు. జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పువ్వాళ్ల దుర్గాప్రసాద్ , వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ కార్పొరేషన్ చైర్మన్ రాయల నాగేశ్వరావు , రాష్ట్ర, జిల్లా నాయకులు కార్పొరేటర్లు, డివిజన్ అధ్యక్షులు, మాజీ కార్పొరేటర్లు, మండల సమన్వయ కమిటీ సభ్యులు, మార్కెట్ కమిటి , ఆత్మ కమిటి, సొసైటీ చైర్మన్లు , డైరెక్టర్లు పాల్గొన్నారు.

## వధూవరులను ఆశీర్వదించిన సిపిఎం నేతలు



**కారేపల్లి, మహా:** అమరజీవి కామ్రేడ్ వినోదరావు రవికుమార్ – అరుణ దంపతుల కుమార్తె మాధవి వివాహ వేడుక బాజుమల్లాయిగూడెం శనివారం జరిగింది. ఈకార్యక్రమానికి సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు కొండబోయిన నాగేశ్వరరావు, మెరుగు సత్యనారాయణ, మండల కార్యదర్శి కే.నరేంద్ర, వజ్జా రామారావు, ఐద్వా డివిజన్ అధ్యక్షురాలు కొండబోయిన ఉమావతి, సీపీఎం నాయకులు మన్నెం బ్రహ్మయ్య, మద్దెల నాగయ్య, వల్లబోయిన కొండలరావు, పూల బాయమ్మ. సరస్వతి, రాణి, సుగుణమ్మ హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు.

## నకిలీ డిడిల వ్యవహారంపై విచారణ

**మణుగూరు, మహా:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరు మండలంలోని ఇసుక ర్యాంపుల వద్ద నకిలీ డిడిల వ్యవహారం సంచలనం రేపుతోంది. ఈ అంశంపై శనివారం ఇంటిలిజెన్స్, పోలీస్ శాఖలు రంగంలోకి దిగాయి. నకిలీ డిడిల సమాచారం మేరకు అశ్వాపురం సీఐ అశోక్ రెడ్డి, ఇంటలిజెన్స్ అధికారి రామారావులు కలిసి రామానుజవరం ఇసుక ర్యాంపు వద్ద విచారణ చేపట్టారు. ఇటీవల అశ్వాపురం పోలీసులకు దొరికిన ఇసుక లారీపై నకిలీ డిడిని ఉపయోగించి అక్రమంగా ఇసుక తరలిస్తున్నట్లు వెల్లడైన విషయం విధితమే. ఈ వ్యవహారంపై టీజీఎండీసీ ప్రాజెక్ట్ అధికారి శంకర్ నాయక్ దర్యాప్తు జరిపి, సంబంధిత డిడి నకిలీ డిడినేనని తేల్చినట్లుగా సోషల్ మీడియాలో ప్రచారం జోరుగా సాగుతోంది. దీంతో అధికారులు అప్రమత్తమై రాంపు వద్ద విచారణ చేపట్టారు. నకిలీ డిడిల సృష్టికర్త ఎవరు, దీనికి వెనుక ఉన్న వ్యక్తులు ఎవరు, ఈ దందా ఎంతకాలంగా కొనసాగుతోంది అన్న అంశాలపై విచారణ కొనసాగుతున్నట్లు సమాచారం. ఇసుక అక్రమ రవాణా వ్యవహారంపై టీజీఎండీసీ, పోలీసులు, ఇంటలిజెన్స్ శాఖలు సమన్వయంతో పని చేస్తున్నట్లు విశ్వసనీయ వర్గాలు వెల్లడించాయి.



# ఖమ్మం అటవీ శాఖలో భారీ కుంభకోణం

**ఖమ్మం,మహా:** ఖమ్మం జిల్లా అటవీ శాఖలో సంద్ర కలప అక్రమ రవాణాకు సంబంధించిన సంచలన విషయాలు వెలుగులోకి వచ్చాయి. ఈ అవినీతి వ్యవహారంలో ఇప్పటికే బీట్ ఆఫీసర్ శ్రీకాంత్‌ను సస్పెండ్ చేయగా, తాజాగా ఫారెస్ట్ రేంజర్ నాగేశ్వరరావుపై వచ్చిన ఆరోపణలు కూడా నిజమని తేలడంతో, ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ సువర్ణ శనివారం ఆయన్ను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. కలపను లేనట్లుగా చూపి, ఇతర జిల్లాలకు, రాష్ట్రాలకు తరలించడంలో రేంజర్ తన విధులను దుర్వినియోగం చేశారని విచారణలో తేలింది. ఈ ఘటన శాఖలోని లోపాలను స్పష్టంగా బయటపెట్టింది. నాగేశ్వరరావు గతంలో ఇల్లందు రేంజ్‌లో పనిచేసినప్పుడు కూడా 'గణేష్ పౌల్జి' వ్యవహారంలో తీవ్ర ఆరోపణలు ఎదుర్కొన్నారు. అప్పుడు జన్నారానికి బదిలీ అయినప్పటికీ, అక్కడకు వెళ్లకుండానే చీఫ్ కన్జర్వేటర్ సహకారంతో తిరిగి ఖమ్మానికి బదిలీ చేయించుకున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈయన ఎక్కడ పనిచేసినా అవినీతికి పాల్పడడం, ఉద్యోగ నైతికతను ప్రశ్నార్థకం చేయడం శాఖ వర్గాల్లో చర్చనీయాంశమైంది. విచారణలో కలప అక్రమ తరలింపులు, విధుల దుర్వినియోగం స్పష్టంగా రుజువు కావడంతో, నాగేశ్వరరావును తక్షణమే విధుల నుండి తొలగించారు. దీంతో శాఖ భద్రతకు, ప్రభుత్వ




నిబంధనలకు రక్షణ కల్పించినట్లయింది. ఖమ్మం రేంజ్ బాధ్యతలను ప్రస్తుతం మధిర రేంజర్‌కు అదనంగా అప్పగించారు. శాఖలో అవినీతి పునరావృతం కాకుండా కఠిన పర్యవేక్షణ అమలు చేస్తామని చీఫ్ కన్జర్వేటర్ బీమా నాయక్ ప్రకటించారు. ఈ సంఘటన ఖమ్మం జిల్లా అటవీ శాఖలో ఉన్నతాధికారుల పర్యవేక్షణ లోపాలను, నియంత్రణ వైఫల్యాలను తెలియజేస్తోంది. ఉద్యోగుల సస్పెన్షన్ అనేది కేవలం ప్రారంభ చర్య మాత్రమేబీ శాఖలో వ్యవస్థాగత మార్పులు, అంతర్గత ఆడిట్, నిరంతర పర్యవేక్షణ తప్పనిసరి అని నిపుణులు అంటున్నారు. స్థానిక, రాష్ట్ర స్థాయిలో కలప వనరుల రక్షణ, ఉద్యోగ నైతికతను పునరుద్ధరించడం ఇప్పుడు ప్రభుత్వానికి ప్రధాన సవాలుగా మారింది. ఖమ్మం జిల్లా ప్రజలు, వనరుల పరిరక్షకులు ఈ వ్యవహారంపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వ్యవస్థాపక లోపాలను సరిచేయకపోతే, చిన్న అక్రమాలు కూడా పెద్ద అవినీతికి దారితీసే ప్రమాదం ఉందని హెచ్చరిస్తున్నారు. ప్రభుత్వం, అటవీ శాఖ ఉన్నతాధికారులు నియంత్రణ వ్యవస్థలను బలోపేతం చేసి, భవిష్యత్తులో ఇలాంటి అవినీతి జరగకుండా కఠిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

## డేంజర్ స్పాట్‌గా రైల్వే అండర్ బ్రిడ్జి!

- బ్రిడ్జి మధ్యలో ఏర్పడిన గుంటలు
- బయటికి తేలిన ఐరన్ చువ్వలు
- ఆందోళనలో వాహనదారులు
- మరమ్మతులు చేపట్టాలని డిమాండ్





**భద్రాద్రి బ్యూరో, మహా:** ప్రతి ఏడాది వర్షాకాలంలో ఈ రైల్వే అండర్ బ్రిడ్జితో వాహనదారులకు ప్రజలకు తిప్పలు తప్పడం లేదు. భారీ వర్షం కురిసింది అంటే చాలు బ్రిడ్జి మధ్యలో వరద నీరు చేరి చెరువును తలపిస్తుంటుంది. అంతేకాకుండా వరద నీరు నిల్వ ఉండడం మూలంగా గుంటలు ఏర్పడి సిసి రోడ్డు నుండి ఇనుప చువ్వలు బయటికి వచ్చి ప్రమాదాలకు సూచికగా నిలుస్తోంది. ఈ ప్రాంతంలో సమస్య ఆందోళన కలిగిస్తున్నప్పటికీ సంబంధిత శాఖల అధికారులు పరిష్కారానికి సరైన చర్యలు తీసుకోవడం లేదని పలువురు నుంచి విమర్శలు వెలువెత్తుతున్నాయి. గత వారం రోజుల నుండి మధ్యాహ్నం సమయంలో భద్రాద్రి జిల్లా కేంద్రంలో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా బ్రిడ్జి మధ్యలో ఉన్న దారిపై కంకర కొట్టుకుపోయి మీటర్ పొడుగునా ఐరన్ చువ్వలు బయటికి వచ్చి డేంజర్ స్పాట్గా నిలిచింది. రాత్రి సమయంలో ఈ ఇనుప చూవ్వల వల్ల మరింత ప్రమాదం పొంచి ఉందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అండర్ బ్రిడ్జి మధ్యలో ఏర్పడిన సమస్యకు పరిష్కారం చూపి ఎలాంటి ప్రమాదాలు ప్రాణాలు పోకుండా చూడాల్సిన బాధ్యత సంబంధిత శాఖల అధికారులపై ఉందని ప్రజలు సూచిస్తున్నారు. కొత్తగూడెం బస్టాండ్ నుండి ఈ రైల్వే అండర్ బ్రిడ్జి మీదుగా పాల్వంచ, భద్రాచలం, ఇల్లందు, బయ్యారం, మహబూబాద్, వరంగల్, కరీంనగర్, నిజాంబాద్ ఊర్లకు నిత్యం బస్సు రాకపోకలు సాగిస్తుంటాయి. స్థానికంగా వాహనదారులు ప్రజలు సైతం ప్రయాణిస్తుంటారు. ఇనుప చువ్వల వల్ల వాహనాలు మరమ్మతులకు గురవుతున్నాయి. సమస్య తీవ్రత ఉన్నప్పటికీ పరిష్కార మార్గానికి అధికారులు సరైన చర్యలు చేపట్టడం లేదని ప్రజలు మండిపడుతున్నారు. అండర్ బ్రిడ్జిలో ఎలాంటి ప్రమాదాలు జరగకుండా తక్షణమే అధికారులు స్పందించి మరమ్మత్తులు చేయాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు. ఇదిలా ఉండగా బ్రిడ్జికి ఇరువైపులా ఇసుక మేటలు పేరుకుపోయి ఉన్నాయి. ఇసుక కుప్పల ద్వారా ప్రమాదాలు జరిగే అవకాశం కూడా ఉంది. ఇసుకను బ్రిడ్జి వద్ద వేలాడుతున్న ప్రైవేట్ కేబుల్ వైర్లను తొలగించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

## మానవతా దృక్పథంతో భరోసా సొసైటీ సేవా కార్యక్రమం

### పెరాలసిస్ బాధితుడికి వీల్‌చైర్ అందజేత

**మణుగూరు, మహా:** మానవతా దృక్పథంతో సామాజిక సేవకు అంకితమవుతున్న భరోసా వెల్ఫేర్ సొసైటీ మరో స్ఫూర్తిదాయక కార్యక్రమాన్ని చేపట్టింది. మణుగూరులోని సుందరయ్య నగర్‌కు చెందిన కే వెంకటరాజు పది సంవత్సరాలుగా పెరాలసిస్ వ్యాధి కారణంగా మంచానికే పరిమితమై ఉన్నారు. ఆయన అవసరాల దృష్ట్యా భరోసా సొసైటీ ఆధ్వర్యంలో అలవాల సబిత, బిట్ర సూర్యుడు, శ్వేత గార్ల సహకారంతో బాధితుడికి శనివారం వీల్‌చైర్‌ను అందించారు. కార్యక్రమంలో సంస్థ గౌరవ అధ్యక్షుడు ఎం లింగబాబు, అధ్యక్షులు ఎండి అమీనుద్దీన్, శోభన్, లీలా, సబిత, లియాకత్, సురేష్, వెంకన్న తదితర సభ్యులు పాల్గొన్నారు.



## మిత్రుని కుటుంబానికి సాయం



**కారేపల్లి, మహా:** రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన మిత్రుని కుటుంబానికి చిన్ననాటి మిత్రులు శనివారం సాయం అందజేసి ధ్కైర్యం చెప్పారు. కారేపల్లి మండలం పేరుపల్లి కి చెందిన యువకుడు సిరికొండ కఅష్ణారావు కొద్ది రోజుల క్రితం జరిగిన రోడ్డు ప్రమాదంలో మఅతి చెందాడు. మఅతుడు 2000–01 సంవత్సరంలో కారేపల్లి హైస్కూల్‌లో పదవ తరగతి చదివాడు. అనాటి స్నేహితుల బఅందం వాట్సాప్ ద్వారా సేకరించిన రూ.13 వేలు నగదును శనివారం ఆ గ్రామ పెద్ద మనుషుల సమక్షంలో బాధితుడు కుటుంబానికి అందించారు. స్నేహితుడి కుటుంబానికి అండగా నిలిచిన మిత్ర బఅందాన్ని గ్రామస్తులు అభినందించారు.

## ప్రమాదబాధితుడిని పరామర్శించిన ఎమ్మెల్యే



**కారేపల్లి, మహా:** కారేపల్లి మండలం తులిస్యతండాకు చెందిన లకావత్ ఆకాష్ రెండు రోజుల క్రితం రోడ్డు ప్రమాదంలో గాయపడి ఖమ్మంలోని ప్రయివేచ్ ఆసుపత్రిలో చికిత్స పొంగదుతున్నాడు. కాంగ్రెస్ నాయకులు సపావట్ నాగులు నాయక్ ద్వారా విషయం తెలుసుకున్న వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ శనివారం ఆసుపత్రిలో ఆకాష్‌ను పరామర్శించి ఆర్థిక సాయం అందజేశారు. వైద్యులత మాట్లాడి మెరుగైన వైద్యం అందిచాలని సూచించారు.

## ఏడు ఇసుక ట్రాక్టర్లు పట్టుకున్న రెవిన్యూ శాఖ

**మణుగూరు, మహా :** మణుగూరులో అక్రమ ఇసుక రవాణాపై రెవిన్యూ అధికారులు చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా శనివారం మణుగూరు పరిధిలో ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ఏడు ట్రాక్టర్లను పట్టుకున్నట్లు తహశీల్దార్ నరేష్ తెలిపారు. సాయంత్రం నాలుగు గంటల సమయంలో అక్రమంగా ఇసుక తరలిస్తున్నారు అన్న సమాచారం మేరకు దాడులు నిర్వహించి ఆరు ట్రాక్టర్లను పట్టుకున్నారు.

# వ్యాపారిపై టీచర్ బూతు పురాణం

- మంత్రి మనిషి నంటూ అధికార దుర్వినియోగం
- సీసీ కెమెరాలు ధ్వంసం ఆపై వీరంగం
- ఏసిపికి సైతం ఫోన్ చేసి బెదిరింపులు
- కలకలం సృష్టించిన స్కూల్ అసిస్టెంట్ నిర్వాకం
- ఉపాధ్యాయుని విధుల నుంచి సస్పెండ్ చేసిన కలెక్టర్



**ఖమ్మం, మహా:** ఖమ్మం నగరంలో ఒక ప్రభుత్వ ఉపాధ్యాయుడు తన అధికారాన్ని అడ్డుపెట్టుకొని, చిన్నపాటి వ్యాపారం చేస్తున్న వ్యక్తిని దుర్భాషలాడి, హత్య బెదిరింపులకు పాల్పడిన ఘటన స్థానికంగా కలకలం సృష్టించింది. ఒక స్కూల్ అసిస్టెంట్ ఏకంగా పోలీస్ ఉన్నతాధికారికి (ఏసీపీ) ఫోన్ చేసి వ్యాపారిని ఖాళీ చేయించాలని బెదిరించడం, సీసీ కెమెరాలను ధ్వంసం చేయడం వంటి రౌడీయిజం చర్యలకు పాల్పడటం తీవ్ర చర్చనీయాంశమైంది. ఈ ఘటనపై జిల్లా విద్యాధికారిణి, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డా. పి. శ్రీజ తక్షణం స్పందించి సదరు ఉపాధ్యాయుడు టి. లక్ష్మణ్‌ను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

### పోటీగా షాపు పెడితే బెదిరింపులు...

పాల్వంచ నుంచి ఖమ్మం వచ్చి మార్కెట్‌లో క్రాకర్ల షాపు పెట్టుకున్న ఒక చిన్న వ్యాపారిపై ప్రభుత్వ స్కూల్ అసిస్టెంట్ టి. లక్ష్మణ్ రావు కక్ష సాధింపు చర్యలకు పాల్పడినట్లు ఆరోపణలు వెలువడ్డాయి. సదరు ఉపాధ్యాయుడు తన కోసం వ్యాపార స్థలాన్ని ఖాళీ చేయించాలనే ఉద్దేశంతో దుకాణాన్ని తొలగించాలని డిమాండ్ చేసినట్లు బాధితులు చెబుతున్నారు.

### ఏసీపీకి ఫోన్ చేసి బూతులు, బెదిరింపులు.

వివాదం పెరగడంతో స్కూల్ అసిస్టెంట్ టి. లక్ష్మణ్ ఏకంగా ఏసీపీకి ఫోన్ చేసి, వ్యాపారిని ఖాళీ చేయించమని గట్టిగా ఆదేశించడమే కాకుండా, బాధితుడిని ఉద్దేశిస్తూ "నిన్ను చంపేస్తా... లంలికొడక" వంటి అసభ్య పదజాలంతో బహిరంగంగా బెదిరింపులకు పాల్పడినట్లు బాధితుడు, సాక్ష్యులు వెల్లడించారు. అంతేకాకుండా, సంఘటనలకు సంబంధించిన సాక్ష్యాలు దొరకకుండా సీసీ కెమెరాలను కూడా ధ్వంసం చేసినట్లు వ్యాపార సంఘాలు, స్థానికులు ఫిర్యాదు చేశారు. ఈ రౌడీయిజంపై కొణిజర్ల పోలీస్ స్టేషన్‌లో టి. లక్ష్మణ్‌పై క్రిమినల్ కేసు నమోదైంది.

### తక్షణ చర్యలు తీసుకున్న విద్యాశాఖ...

పాఠశాల అధికారి స్థాయిలో ఉన్న వ్యక్తి బహిరంగంగా రౌడీలా ప్రవర్తించడం, ప్రభుత్వ ఉద్యోగుల ఆచరణ నియమాలను ఉల్లంఘించడంతో స్థానిక తల్లిదండ్రులు, విద్యాసంస్థలు తీవ్ర ఆందోళన చెందాయి. ఈ పరిణామాలపై జిల్లా విద్యాధికారిణి, అదనపు కలెక్టర్ డా. పి. శ్రీజ వెంటనే విచారణ నిర్వహించారు. సీసీ కెమెరాల ధ్వంసం, అపకార్యక్రమ పరిహారం, ప్రభుత్వ ఉద్యోగుల నిబంధనల ఉల్లంఘన వంటి కారణాలను స్పష్టం చేస్తూ స్కూల్ అసిస్టెంట్ టి. లక్ష్మణ్‌ను సస్పెండ్ చేస్తూ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఆయనపై నమోదైన క్రిమినల్ కేసు విచారణకు కూడా విద్యాశాఖ సహకరిస్తున్నట్లు తెలిపారు.

### న్యాయం చేయాలని డిమాండ్

పోలీసులు కేసులో కీలకమైన సీసీటీవీ ఫుటేజ్, మొబైల్ కాల్ రికార్డులు, ప్రత్యక్ష సాక్ష్యాలను సేకరించి దర్యాప్తు చేస్తున్నారు. అధికార బలం, రాజకీయ సంబంధాలకోసం సామాన్యుడిపై ముప్పుపెట్టడం అన్యాయమని, ఇది రాష్ట్ర వ్యవస్థల వినియోగాన్ని ప్రశ్నార్థకం చేస్తుందని స్థానిక రాజకీయ, సామాజిక వర్గాలు తీవ్రంగా విమర్శిస్తున్నాయి. ప్రజలకు న్యాయం జరగాలంటే, పారదర్శకమైన, కఠినమైన విచారణ చేపట్టాలని డిమాండ్లు పెరుగుతున్నాయి. చిన్న వ్యాపారులకు భద్రత కల్పించడానికి అధికారులు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

# హిందుత్వమే భారత్ ఆత్మ

**ఖమ్మం, మహా:** హిందుత్వమే భారతదేశపు ఆత్మ అని, ధర్మరక్షణే మన కర్తవ్య మార్గమని సామాజిక సమరసత వేదిక తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ అప్పాల ప్రసాద్ ఉద్ఘాటించారు. ధర్మరక్షణ అంటే కత్తి పట్టడం కాదని, సత్యాన్ని నిలబెట్టడం అని ఆయన స్పష్టం చేశారు. "మనిషి తనలోని చెడు ప్రవృత్తులను జయించి, పరమాత్మ సన్నిధిలో నిజాయితీగా నిలబడినప్పుడే అదే ధర్మరక్షణ" అని ఆయన పేర్కొన్నారు. ఖమ్మం నగరంలో అఖిల భారత అయ్యప్ప దీక్ష ప్రచార సమితి ఆధ్వర్యంలో, శ్రీశ్రీశ్రీ తాంఢ్ర రాంప్రసాద్ గురుస్వామి మార్గదర్శకత్వంలో, శ్రీ తాంఢ్ర మంజుల సేవా ట్రస్ట్ నిర్వహణలో ఏర్పాటైన అయ్యప్ప అన్నప్రసాద వితరణ ప్రాంగణం 17వ వసంతంలోకి అడుగుపెట్టిన సందర్భంగా శనివారం నిర్వహించిన కార్యక్రమానికి అప్పాల ప్రసాద్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. హిందుత్వం అనేది మతపరమైన పదం కాదని, అది మన సంస్కృతి, మన చరిత్ర, మన నాడి అని అప్పాల ప్రసాద్ అన్నారు. హిందూ అంటే కేవలం ఆచారంలో ఉండేవాడు కాదని, ఆలోచనలో, ఆత్మలో భారతీయతను మోసేవాడని ఆయన వివరించారు. భారతదేశ ఔన్నత్యం హిందువుల జీవన విలువలతో కొనసాగుతోందని, ఈ దేశం యుద్ధాలతో కాకుండా యజ్ఞాలతో, ఆధ్యాత్మికతతో, దయతో నిలబడిందని ఆయన చెప్పారు. హిందువులు ఏకమైతే ఏదీ అసాధ్యం కాదని, ఐక్యతలోనే శక్తి ఉందని ఆయన పిలుపునిచ్చారు. సనాతన సంస్కృతిని రక్షించాలంటే ముందుగా హిందువులు తమలోని చిన్నచిన్న విభేదాలను విడిచిపెట్టాలని కోరారు. హిందుత్వం అంటే మరే వర్గాన్ని వ్యతిరేకించడం కాదని, అది మనుష్యత్వం, సేవా భావం, సహనం, ప్రతి మనిషిలో ఉన్న దేవత్వాన్ని గుర్తించడం అని అన్నారు.

### అన్నప్రసాద వితరణ ప్రాంగణం ప్రారంభం...

ఈ సందర్భంగా తాంఢ్ర రాంప్రసాద్ గురుస్వామి మాట్లాడుతూ, అయ్యప్ప భక్తుల ఐక్యతే ఈ సేవా కార్యక్రమానికి ప్రాణం అని, భక్తుల కృషితోనే 17 ఏళ్లుగా నిరంతరంగా కొనసాగుతోందని, అన్నదానం అనేది భక్తికి ప్రతిరూపం అని అన్నారు. అనంతరం అన్నప్రసాద వితరణ ప్రాంగణాన్ని ప్రారంభించి అయ్యప్ప స్వామి పూజ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భారతీయ జనతా పార్టీ ఖమ్మం జిల్లా అధ్యక్షులు నెల్లూరి కోటేశ్వరరావు, అఖిల భారత అయ్యప్ప దీక్ష ప్రచార సమితి జాతీయ అధ్యక్షులు రాజ్ దేశ్ పాండే, బొమ్మన్ ఎడ్యుకేషనల్ సొసైటీ చైర్మన్ బొమ్మ రాజేశ్వరరావు, ఏ ఎస్ ఏ డి పి ఎస్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు కేశవ గురుస్వామి, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వాసు గురుస్వామి, తెలంగాణ శబరిమల అనంతగిరి ఆలయ చైర్మన్ కొండపల్లి వాసు తదితరులు కూడా ప్రసంగించారు. కార్యక్రమ అనంతరం ముఖ్య అతిథులను సన్మానించారు. అన్నదాన వితరణ ప్రాంగణం ప్రారంభం సందర్భంగా జిల్లా వ్యాప్తంగా వందల మంది అయ్యప్ప స్వాములు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

